
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3 జయశంకర్ భూపాలపల్లి
ఆదివారం 16 మార్చి 2025





దాన ధర్మాల.. జకాత్



రంజాన్ మాసంలో ఇదో పవిత్ర కార్యక్రమం

- సంపాదనలో కొంత పేదలకు పంచాలని బోధిస్తున్న ఖురాన్
- డబ్బు, ఆస్తిపై వ్యామోహాన్ని దూరం చేయడమే పరమార్థం

కఠిన ఉపవాస దీక్షల మాసం రంజాన్. ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో కఠోన నియమనిష్టలతో రోజా పాటిస్తారు. అలాంటి పవిత్ర మాసంలో ముస్లింలు పాటించాల్సిన మరో పవిత్ర కార్యక్రమం జకాత్. అంటే ఏడాది పాటు తాము సంపాదించిన దానిలో కొంత మొత్తాన్ని పేదలకు పంచిపెట్టడం. ఈ జకాత్ చెల్లించడం వల్ల ధనం పరిశుద్ధమవుతుందని, డబ్బు, ఆస్తులపై వ్యామోహం తగ్గుతుందని ఖురాన్ చెబుతోంది. అయితే 'నిసాబ్' నిర్ణయించిన పరిమాణం మేరకు ఈ జకాజకాత్ చెల్లించాల్సి ఉండగా.. ఇందులోనూ ఇచ్చేవారు, తీసుకునే వారికి ఉండాల్సిన అర్హతలను సూచించింది. ముఖ్యంగా నిరుపేదలు, అనాథలకు తప్ప నిసరిగా చెల్లించాలన్న పరమార్థం ఉందని మత పెద్దలు చెబుతున్నారు. - మహబూబాబాద్, ఆంధ్రజ్యోతి

5

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:32 (ఆదివారం సాయంత్రం)
సహర్: 5:01 (సోమవారం ఉదయం)

అభివృద్ధికి అడుగులు

స్టేషన్‌ఘనపూర్‌కు నిధుల వెల్లువ



ప్రజాపాలన సభకు శివునిపల్లిలో సిద్ధమైన వేదిక

- నేడు సీఎం రేవంత్ రాక.. రూ.800కోట్ల పనులకు శంకుస్థాపన
- శివునిపల్లిలో 50వేల మందితో 'ప్రజాపాలన' బహిరంగసభ
- పటిష్ఠ ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం

జనగామ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. నియోజకవర్గంలోని పలు పనులకు సంబంధించి ప్రభుత్వం నుంచి భారీ మొత్తంలో నిధులు విడుదలవగా ఆ పనులకు ఆదివారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టబోతున్నారు. ముఖ్యంగా ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, డివిజన్ స్థాయి కార్యాలయాల సముదాయం, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, వంద పడకల ఆస్పత్రి సహా పలు అభివృద్ధి పనులు పట్టాలెక్కనున్నాయి. 13 శాఖలకు సంబంధించి 30 అభివృద్ధి పనులకు రూ.800 కోట్లు మంజూరవగా ఆ పనులకు రేవంత్ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే 50వేల మందితో శివునిపల్లి వద్ద జరిగే 'ప్రజాపాలన' బహిరంగ సభ ద్వారా జిల్లాకు మరిన్ని వరాలు ఇస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే 'ప్రజాపాలన' సభకు వచ్చే వారు ఎండ ఇబ్బందులు పడకుండా జర్మన్ టెక్నాలజీ టెంట్లను వేశారు. దాహార్తిని తీర్చేందుకు మంచినీటి, మజ్జిగ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. అలాగే సభకు వచ్చే వారి వాహనాల కోసం రెండు చోట్ల పార్కింగ్ పాయింట్లను ఇచ్చారు. సీఎం పర్యటన నేపథ్యంలో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి జనసమీకరణ చేస్తున్నారు. ఓవైపు కడియం శ్రీహరి, కాంగ్రెస్ శ్రేణులతో పాటు అధికారిక కార్యక్రమం కావడంతో మరోవైపు అధికారులు కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. సీఎం సభ కోసం నియోజకవర్గంలోని ఏడు మండలాల నుంచి జనాన్ని తరలించేందుకు 260 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా

సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్‌లో 2.10గంటల పాటు పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12.25గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి స్టేషన్‌ఘన్‌పూర్ చేరుకుంటారు. మధ్యాహ్నం

మిగతా 5వ పేజీలో..



సభా స్థలిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కడియం, సీపీ, కలెక్టర్

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఎంపీ కావ్యతో కలిసి విలేకరుల సమావేశం

5



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

గోవిందా.. గోవిందా..

- కొనసాగుతున్న కోటంచ లక్ష్మీనరసింహస్వామి జాతర
- గజవాహన యాత్రకు పోటెత్తిన భక్తజనం

వివరాలు 4వ పేజీలో ..

'ప్రకృతి విధానంలో వ్యవసాయం చేయాలి'

కొత్తగూడ, మార్చి15 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి విధానంలో వ్యవసాయం చేసి మానవ ఆరోగ్యాన్ని కాపాడి, భూమి సారవంతం పెంచుకోవాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు ఉమారెడ్డి సూచించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో మండల కేంద్రంలోని రైతు వేదికలో గిరిజన ఉపప్రణాళిక పథకం కింద శనివారం రైతు సదస్సు నిర్వహించారు. రైతులకు మేకలు, పశువులు పంపిణీ చేశారు. సదస్సులో కేవీకే సమన్వయ కర్త మాలతి, ఉద్యాన శాస్త్రవేత్త రాంబాబు, వ్యవసాయ శాఖ సహ సంచాలకుడు శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారి రాజు, ఉద్యాన అధికారి శాంతి ప్రియదర్శిని, వెటర్నరీ వైద్యుడు శ్రీకాంత్, ఏఈవోలు రాజు, మునిప్రసాద్, వినోద్, అరవింద్, రైతులు పాల్గొన్నారు.



కొత్తగూడలో మాట్లాడుతున్న ఉమా రెడ్డి

పశువుల అక్రమ రవాణా, గుడుంబా నిర్మూలనకు కఠిన చర్యలు

- ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

ఏటూరునాగారం రూరల్, మార్చి 15, (ఆంధ్రజ్యోతి): సబ్ డివిజన్‌పరిధిలో పశువుల అక్రమ రవాణా, గంజాయి నిర్మూలనకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తెలిపారు. శనివారం స్థానిక ఏఎస్పీ కార్యాలయంలో ఏఎస్పీ విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఏటూరునాగారం సబ్ డివిజన్ పరిధిలో అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న 10 మందిపై కేసులు నమోదు చేసి 162 పశువులను సంరక్షించి గోశాలకు తరలించడం జరిగిందన్నారు. ఇట్టి కేసుల్లో పశువు అక్రమ రవాణాలకు పాల్పడిన 42 మందిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు ఏఎస్పీ తెలిపారు. అంతేకాకుండా గతేడాది గంజాయి విక్రయిస్తున్న 38 మందిని అదుపులోకి తీసుకొని 48.05 కేజీల రూ. 13,74,825 విలువ గల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, అదేవిధంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 2547 కేజీల గంజాయి పట్టుకొని నలుగురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేసి వారిని రిమాండ్ తరలించినట్లు ఏఎస్పీ స్పష్టం చేశారు. గంజాయి రహిత సమాజం కోసం పోలీసులు విశిష్ట సేవలందించడం జరుగుతున్నందని, పాఠశాల స్థాయి నుంచి డిగ్రీ వరకు విద్యార్థులకు యాంటీ డ్రగ్స్ వారియర్స్ పేరుతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఏఎస్పీ తెలిపారు. డివిజన్ పరిధిలో అనుమానిత ప్రాంతాల్లో యాంటీ నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ బృందాలతో మాదక ద్రవ్యాలపై సోదాలు నిర్వర్తిస్తున్నామని, ప్రజలకు హాని కలిగించే గంజాయి, మాదక ద్రవ్యాలపై ప్రజలకు సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు 100 నంబర్‌తో పాటు 1908 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు.

కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా చేస్తున్న మహిళలు

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వేశాలపల్లి డబుల్‌బెడ్ రూం లబ్ధిదారులు కలెక్టరేట్ ఎదుట ఖాళీ బిందెలతో ధర్నాకు దిగారు. కలెక్టరేట్ కార్యాలయం ప్రధాన గేటు వద్ద శనివారం మహిళలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తాగునీటి సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. రెండేళ్లుగా నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మార్చిలోనే తీవ్రమైన నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని వేసవిలో మాకు మరిన్ని ఇబ్బందులు తప్పేట్టులేదన్నారు. అధికారులు వెంటనే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సురేష్, రాజేష్, సుజాత, గంగా,స్వాతి, రామ, సృజన తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యాబోధన ఉపయోగకరం

- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ

కృష్ణకాలనీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాల విద్యార్థులలో అభ్యాసన సామర్థ్యాల పెంపునకు కృత్రిమ మేధ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ విద్యాబోధన ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర రాహుల్‌శర్మ అన్నారు. భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట ఎంపీపీఎస్ పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యాబోధన కార్యక్రమాన్ని జిల్లాలో లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు మెరుగైన సామర్థ్యాలు అనగా చదవడం, రాయడం, లెక్కించడం వంటి ప్రక్రియల్లో మెరుగుపరచడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ఎఫ్.ఎల్.ఎన్ కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించడంలో భాగంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో విద్యాబోధన చాలా ఉపయోగపడుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ సూచించారు. భూపాలపల్లి మండలంలోని గుర్రంపేట గ్రామంలో గల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు కలెక్టర్ ప్రేరణ కరపత్రాల్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే బయపడొద్దన్నారు. అనంతరం ఇదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిం చారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. పలువురు చిన్నారులు రైమ్స్ చెప్పడాన్ని చూసి ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, ఎంఈవో లక్ష్మణ్, తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను సమర్దవంతంగా పరిష్కరించాలి

భూపాలపల్లి కలెక్టరేట్ : జిల్లాలో ప్రజల సమస్యలను సమర్థవం తంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని మండలాల తహసీల్దార్ కార్యాలయాలల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులు తహసీల్దార్, ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ ప్రజా వాణి నిర్వహణ, వసతి గృహాల్లో సౌకర్యాలు, మెనూ అమలు, ప్రభుత్వ ఆస్ప త్రుల్లో సిబ్బంది సమయపాలన, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు నాణ్యతపై సమీ క్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ముగిసినందున యంత్రాంగం పరిపాలనపై దృష్టిసారించాలన్నారు. ప్రతీ సోమవారం మండల కార్యాలయాల్లో ప్రజావాణి నిర్వహించి సమస్యల పరిష్కరంపై నివేదిక అందిం చాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతీ వారంలో రెండు రోజులు గ్రామాల్లో పర్యటించడంతో పాటు వసతి గృహాల్లో సౌకర్యాలు, మెనూ అమలు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది సమయపాలన, మధ్యాహ్న భోజన ఏర్పాట్లు నాణ్యతను పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యాబోధన తరగతి గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్

నకిలీ వస్తువులపై జాగ్రత్తగా ఉండాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజలు కల్తీ, నకిలీ వస్తువులు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వినియోగదారుల మండలి ఉమ్మడి భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు చల్లగురుగుల మల్లయ్య అన్నారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ములుగులోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా పౌరసరఫరాల శాఖ, వినియోగదారుల మండలి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రకృతిని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తూ రాబోయే తరాలకు సరైన వాతావరణాన్ని కల్పించడం మన బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ములుగు జిల్లా పౌరసరఫరాలశాఖ ఇన్‌చార్జి అధికారి, మేనేజర్ రాంపతి, డిప్యూటీ తహసీల్దార్‌లు నితీష్, రాంచందర్, ములుగు, భూపాలపల్లి వినియోగదారుల మండలి కోశాధికారి సంగ రంజిత్, సభ్యులు చుంచు రమేష్, చల్లగురుగుల రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు క్యాతం రాజేందర్, ఉపాధ్యాయులు శిరుప సతీష్‌కుమార్, పిట్టల మల్లయ్య, హమీద్, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలపై పర్యవేక్షణ ఏదీ..?

- భూపాలపల్లి ప్రాజెక్టు పరిధిలో 417 సెంటర్లు..
- ఇన్‌చార్జి డీడబ్ల్యువో బాధ్యతలు సీడీపీవోకే అప్పగింత
- సమయపాలన పాటించని 8 మందికి ఇప్పటికే మెమోలు జారీ

కృష్ణకాలనీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. క్షేత్రస్థాయిలో పరిశీలించకపోవడంతో ప్రభుత్వ పథకాల అమలు తీరు అంతంత మాత్రంగానే జరుగుతోంది. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పకడ్బందీగా సాగేందుకు సీడీపీవోతో పాటు సూపర్‌వైజర్ల నిరంతర పర్యవేక్షణ ఉండాల్సి ఉంటుంది. భూపాలపల్లి ప్రాజెక్టు కింద మొత్తంగా 417 అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయి. వీటి పర్యవేక్షణ బాధ్యత సీడీపీవోతో పాటు సూపర్‌వైజర్లు చూసుకోవాలి. మొత్తంగా 17 మంది సూపర్‌వైజర్లు ఉండాల్సి ఉండగా 14 మంది మాత్రమే ఉన్నారు. ఖాళీగా ఉన్న స్థానాల్లోని పని భారమంతా ప్రస్తుతమున్నవారే మోస్తున్నారు. దీంతో ఇప్పటికే పర్యవేక్షణ కొరవడుతోందనే ఆరోపణలు మెండుగానే ఉన్నాయి. అయితే, గత నెల ఫిబ్రవరి 28న ఈ శాఖ జిల్లా అధికారిగా పని చేసిన చెన్నయ్య పదవీ విరమణ పొందారు. దీంతో భూపాలపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టుకు సీడీపీవోగా ఇటీవలే నియమితులైన మల్లీశ్వరికి అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే, ఐసీడీఎస్ పరిధిలోని కార్యకలాపాలే సీడీపీవోకు పెద్ద బాధ్యతగా చెప్పుకోవచ్చు. అలాంటిది మళ్లీ సదరు అధికారికే ఇన్‌చార్జి బాధ్యతలు ఇస్తే పరిపాలన సజావుగా సాగే పరిస్థితి ఏర్పడదని, పర్యవేక్షణ మరింత కొరవడుతుందనే అభిప్రాయాలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ శాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేసే సిబ్బందిపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో విజిలెన్స్ విచారణ సైతం కొనసాగుతోంది. ఈ తరుణంలో మళ్లీ ఇన్‌చార్జి అధికారులొస్తే శాఖ పరిస్థితి మరింత అగమ్యగోచరంగా మారే పరిస్థితి ఏర్పడుతుందనే విమర్శలు వస్తున్నాయి. పర్యవేక్షణ కొరవడడంతో కొంత మంది టీచర్లు సమయపాలన పాటించకపోవడం, ప్రీ స్కూలు కార్యక్రమాలు సరిగ్గా చేపట్టకపోవడం, డ్రెస్‌కోడ్ ధరించకపోవడం ఇతరత్రా కారణాల తో భూపాలపల్లి ప్రాజెక్టు పరిధిలోని 8 మంది టీచర్లుకు ఈ శాఖ నుంచి మెమోలు సైతం జారీ అయినట్లు తెలిసింది. అలాంటిది ఇన్‌చార్జి పాలన వస్తే శాఖ మరింత గాడితప్పే ఆస్కారం కలుగవచ్చుననే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్‌తో పాటు, ఈ శాఖ కమిషనర్ దృష్టి సారించి జిల్లా స్త్రీశిశు, మహిళా సంక్షేమశాఖకు పూర్తి స్థాయి అధికారినో లేదా.. గతంలో మాదిరిగా ఇతరశాఖలో జిల్లా అధికారిగా పని చేస్తున్న వారికో బాధ్యతలు అప్పగిస్తే కాస్త ఈ శాఖ గాడిన పడే పరిస్థితి లేకపోలేదనే అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలి

- సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి
- 26 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేత



ఉద్యోగంలో చేరిన వారితో జీఎం రాజేశ్వర్‌రెడ్డి

కృష్ణకాలనీ, మార్చి 15(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో ఉద్యోగంలో చేరిన వారంతా రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి అంకితభావంతో పనిచేయాలని సింగరేణి జనరల్ మేనేజర్ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సింగరేణి సంస్థలో నూతనంగా చేరిన 26 మందికి శనివారం నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్థలో చేరుతున్న వారు క్రమశిక్షణతో పని చేయాలన్నారు. మొదటి రోజు నుంచే నిర్ధేశిత లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్య సాధనకై పట్టుదలతో పని చేయాలని సూచించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలో ఉద్యోగం సాధించడం అదృష్టంగా భావించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ కుటుంబ సభ్యులతో కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏరియా అధికార ప్రతినిధి మారుతి, అధికారులు గుండు రాజు, శ్రావణ్ కుమార్, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

కేన్ ప్రాంతాన్ని సందర్శించిన పరిశోధక బృందం



కేన్ మొక్కలను పరిశీలిస్తున్న పరిశోధకులు, విద్యార్థులు

వెంకటాపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలంపేట గ్రామ శివారులో ఉన్న కేన్ మొక్కల ప్రాంతాన్ని వరంగల్‌కు చెందిన అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల అధ్యాపకులు, వృక్షశాస్త్ర పరిశోధకులు, కేన్ మ్యాన్ ఆఫ్ తెలంగాణ డాక్టర్ సుతారి సతీష్ శనివారం సందర్శించారు. పరిశోధనలో భాగంగా ఇక్కడ లభించే అరుదైన కేన్ మొక్కల స్థితిగతులు, పరిశోధన చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణలోనే ఉన్న ఏకైక కేన్ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఇక్కడ సుమారు 125 జాతుల మందు మొక్కలు ఉండి వివిధ రకాలైన రోగాలను నయం చేయడానికి ఆయుర్వేదంలో ఉపయోగించబడుతున్నాయని తెలిపారు. అంతేకాక ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజు ఆయుర్వేదానికి ప్రశక్తి పెరుగుతున్న దరిమిలా ఇక్కడ 51 ఎకరాల్లో లభించే ఈ అరుదైన మొక్కలను కాపాడుకుని ఆరోగ్య భారత్‌ను నిర్మించాలని అన్నారు. డాక్టర్ సుతారి సతీష్ మాట్లాడుతూ 51 ఎకరాల చుట్టూ కందకం తవ్వించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి కేన్ మొక్కల ప్రాంతాన్ని కన్జర్వేషన్ రిజర్వు జోన్‌గా ప్రకటించాలన్నారు., కెనోపివాక్ పేరుతో ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని, తద్వారా ఈ అరుదైన కేన్ మొక్కల ప్రాంతాన్ని రక్షించుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. పరిశోధన బృందంలో ఆయుర్వేద పరిశోధక విద్యార్థులు నిఖిత, కృష్ణసాయి, ఆకాష్, సుమ, తదితరులు పాల్గొన్నారు.

గోవిందా.. గోవిందా..

- కొనసాగుతున్న కోటంచ లక్ష్మీనరసింహస్వామి జాతర
- గజవాహన యాత్రకు పోటెత్తిన భక్తజనం



కోటంచలో గజ వాహనాలపై లక్ష్మీనరసింహస్వామి, అమ్మవార్లను ఊరేగిస్తున్న భక్తులు

రేగొండ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కోరిన కోర్కెలు తీర్చే కోటంచ లక్ష్మీనరసింహస్వామి జాతరకు జనం పోటెత్తారు. ఏడో రోజు ప్రధాన అర్చకులు బుచ్చమాచార్యులు, శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో నిత్యపూజలు జరిగాయి. ఈ సందర్భంగా పిల్లలు, పెద్దలు తరలివచ్చి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. జోగయ్యపల్లి, లింగాల గ్రామస్తులు భక్తితో చేసిన గజవాహన సేవను తిలకించేందుకు ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

కనులు చూడతరమా గజవాహన యాత్ర

ఒకవైపు అమ్మాయి(లక్ష్మీ అమ్మవార్లు) తరపువారు, మరోవైపు అబ్బాయి(లక్ష్మీనరసింహస్వామి) తరపువారు చేసిన హడావిడి ఆసక్తిగా మారింది. ఎవరికి వారు నృత్యాలు, భక్తి గీతాలతో పరవశిస్తూ చేసిన



గజవాహనాలకు హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

గజవాహన యాత్ర ఉత్సవాన్ని చూడడానికి మహిళలు, భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. జోగయ్యపల్లి నుంచి కనుకుంట్ల వంశస్తులు, లింగాల గ్రామం నుంచి ఆ గ్రామస్తులు ఈ గజ వాహన యాత్ర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కాగా, శుక్రవారం రాత్రి లక్ష్మీనరసింహస్వామి గజవాహనం లింగాల గ్రామం నుంచి కోటంచకు చేరుకుంది. శనివారం జోగయ్యపల్లి నుంచి అమ్మవారిని పూలతో అలంకరించిన గజ వాహనంపై ఊరేగింపుగా కోటంచ ఆలయానికి తీసుకువచ్చారు. అనంతరం రెండు గ్రామాల వారు స్వామి, అమ్మవార్లను పరస్పరం మార్చుకుని గజవాహనాలపై పుర వీధులలో ఊరేగింపు చేశారు. ఈ సందర్భంగా యువకులు, మహిళలు కోలాటాలు నృత్యాలతో అలరించి తమ భక్తిని చాటుకున్నారు.

అలరించిన డోలోత్సవం

లక్ష్మీనరసింహస్వామి, లక్ష్మీ అమ్మవార్లను కోటంచ, లింగాల గ్రామస్తులు తీసుకొని వచ్చి అలంకరించిన ఊయలలో కూర్చోబెట్టారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారికి వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతి పాటలు పాడుతుండగా ఊయలను ఊపారు. భక్తులు భక్తిపారవశ్యంతో నృత్యాలు చేస్తుండగా స్వామి వారి డోలోత్సవం పూర్తి చేశారు.

దర్శించుకున్న ప్రముఖులు

లక్ష్మీనరసింహస్వామి వారిని మాజీ ఎంపీ సీతారాం నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్‌రెడ్డి, సీఐ మల్లేష్ యాదవ్ దర్శించుకుని పూజలు చేశారు. అలాగే జిల్లా వైద్యాధికారి మధుసూదన్ స్వామి వారిని దర్శించుకుని వైద్య శిబిరాన్ని సందర్శించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఈవో మహేష్, ఆలయ చైర్మన్ భిక్షపతి ఏర్పాట్లను పరిశీలించారు. సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై సందీప్‌కుమార్‌లు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రతాఏర్పాట్లను పర్యవేక్షించారు.

సార్ ఎక్కడ?

- మెడికల్ కాలేజీలో కనిపించని ప్రిన్సిపాల్

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): పేదింటి బిడ్డలకు వైద్య విద్యను అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్లక్ష్యపు నీడలు కమ్ముకుంటున్నాయి. విద్యార్థులు, అధ్యాపకులను పర్యవేక్షించాల్సిన ప్రిన్సిపాలే కాలేజీ మొఖం చూడటం లేదు. భూపాలపల్లి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం విధుల్లో ఉన్న ప్రిన్సిపాల్ మధ్యాహ్నం వరకు కాలేజీ వైపు కన్నెత్తి చూడనేలేదు. కాలేజీలో ఉండి పర్యవేక్షించాల్సిన ప్రిన్సిపాలే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో విద్యార్థులు, అధ్యాపకులు గాడి తప్పుతున్నట్లు సమాచారం. కలెక్టర్ రాహుల్‌శర్మ మెడికల్ కాలేజీపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

అంతర్ జిల్లా నేరస్థుడి అరెస్ట్

- 108 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన మానుకోట డీఎస్పీ తిరుపతిరావు



కేసు వివరాలు వెల్లడిస్తున్న మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్‌రూరల్, మార్చి 15(ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా నేరస్తుడు పూనెం రాజును అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 108 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు శనివారం తెలిపారు. మహబూబాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసువివరాలను వెల్లడించారు. కురవి బస్టాండ్ వద్ద సీసీఎస్ సీఐ హత్తిరాం, ఎస్సై తహేర్‌బాబా, గోపి, సతీష్‌లు పెట్రోలింగ్ చేస్తుండగా, ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కన్పించడంతో.. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించినట్లు చెప్పారు. దీంతో తాను చేసిన నేరాలను ఒప్పుకున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన పూనెం రాజుపై వివిధ జిల్లాల్లో 11 కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. 2024 జూలై నుంచి మార్చి 2025 వరకు పలు చోరీలకు పాల్పడినట్లు చెప్పారు. కురవి పోలీస్‌స్టేషన్ పరిధిలో తేజావత్‌తండా, కంచర్లగూడెంలో 1, కారేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 8, టేకులపల్లి, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో 2, వెరసి మొత్తం 11 కేసులు నమోదైనట్లు చెప్పారు. ఈ కేసును చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న సీసీఎస్ సీఐ హత్తిరాం, ఎస్సైలు తహేర్ బాబా, సతీష్, గోపి, సిబ్బందిని జిల్లా ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించి రివార్డులు అందించినట్లు డీఎస్పీ తెలిపారు.

రోడ్డు వెంట ప్రమాదకరంగా బావులు

- గత నెలలో సైకిల్ సహా బావిలో పడి వ్యక్తి మృతి
- ఇంటికన్నె రోడ్డు దుస్థితిపై వాహనదారుల ఆందోళన

కేసముద్రం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం నుంచి వెంకటగిరి, ఇంటికన్నె గ్రామాలకు వెళ్లే డబుల్‌రోడ్డు వెంట పలు చోట్ల బావులు ప్రమాదకరంగా ఉన్నాయి. సింగిల్ బీటీ రోడ్డుగా ఉన్న ఈ మార్గాన్ని కొద్దినెలల క్రితం డబుల్ బీటీరోడ్డుగా అభివృద్ధి చేశారు. ఐదు కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డు వెంట ఐదారు వ్యవసాయ బావులు ప్రమాదకరంగా పొంచి ఉన్నాయి. కేసముద్రం బైపాస్‌రోడ్డు వెంట ఉన్న బావిలోకి 2022, అక్టోబరు, 28న కారు దూసుకెళ్లి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లికి చెందిన భద్రు, అచ్చాలి దంపతులు, మహబూబాబాద్ పట్టణం సురేష్‌నగర్‌కు చెందిన లలిత, ఆమె కుమారుడు గుగులోత్ నరేష్‌లు మృతి చెందారు. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. కేసముద్రం-ఇంటికన్నె మార్గంలోని డబుల్‌బీటీ రోడ్డులో గతనెల 1న రోడ్డు వెంటనున్న బావిలోకి సైకిల్ తొక్కుతూ ప్రమాదవశాత్తు ఇంటికన్నెకు చెందిన చెలగోల చిన్న దూడయ్య(45) పడి మృతి చెందాడు. వెంకటగిరి, ఇంటికన్నె రోడ్డులో సైడ్‌బర్మ్ స్థానంలో బావులు ఉండడంతో ఈ రెండు ప్రమాదాలను గుర్తుతెచ్చుకుంటూ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఏఈ అనీల్‌ను వివరణ కోరగా ఇంటికన్నె మార్గంలో ప్రమాదభరితంగా ఉన్న బావుల వద్ద రక్షణ గోడ నిర్మించేందుకు, వీలులేని చోట పూడ్చివేతకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, అనుమతి రాగానే చర్యలు చేపడుతామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి త్వరితగతిన ఈ బావుల వద్ద రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



కేసముద్రం-ఇంటికన్నె మార్గంలో రోడ్డుకు ఒకేచోట ఇరువైపులా ప్రమాదకరంగా ఉన్న బావులు



భూపాలపల్లి అడవిలోనే ఆడపులి సంచారం!

- రెండో రోజు పాదముద్రలను గుర్తించిన అధికారులు
- సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు

కృష్ణకాలనీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి మండలంలోని అడవుల్లోనే ఆడపులి సంచరిస్తోంది. రెండో రోజు సైతం అటవీ శాఖ అధికారులు ఆడపులి ఆనవాళ్లను గుర్తించారు. రాంపూర్-కమలాపూర్ అటవీ ప్రాంతంలో పులి సంచరించడాన్ని పాదముద్రల ద్వారా గుర్తించారు. మరో మూడు, నాలుగు రోజులు ఇదే ప్రాంతంలో పులి సంచరించనున్నట్లు అధికారులు భావిస్తుండగా ఆసమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. కాటారం మండలంలోని మేడిపల్లి, కొత్తపల్లి, భూపాలపల్లి మండలంలోని రాంపూర్, కమలాపూర్, చికెన్‌పల్లి గ్రామాల్లో పులి సంచరిస్తోందని.. ప్రజలు అడవుల్లోకి వెళ్లొదని డప్పు చాటింపు చేశారు. మరోవైపు ఏదైనా పరిస్థితుల్లో పులి సంచరిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అటవీ అధికారులు సూచనలు చేస్తూ సోషల్ మీడియా వేదికగా అవగాహన కల్పిస్తున్నారు.



రాంపూర్-కమలాపూర్ అటవీ ప్రాంతంలో ఫారెస్ట్ అధికారులు గుర్తించిన ఆడ పులి పాదముద్రలు

- కాటారం : కాటారం అడవుల్లోని నీటి వనరులు, కాలిబాటల్లో పగ్‌మార్క్స్(పులి పాదముద్రలు)తో పులి ఇక్కడే తిరుగుతున్నట్లు అధికారులు అభిప్రాయపడుతున్నారు. అడవుల్లో పెద్దపులి సంచరించినట్లు ఆనవాళ్లు కనిపించగా పులి జాడ కోసం కాటారం, మహదేవపూర్ ఎఫ్‌ఆర్వోలు స్వాతి, రవికుమార్ నేతృత్వంలో పలువురు అటవీ అధికారులు, సిబ్బంది అడవులను జల్లెడ పట్టారు. పులి సంచారానికి సంబంధించి పీరాపూర్ బీట్ పరిధిలోని అడవుల్లో పాదముద్రలు(పగ్ మార్క్స్) కనిపించడంతో అడవుల చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఇతరులు అడవుల్లోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు. పులి జాడ, ఇతర వివరాలు తెలుసుకోవడానికి జన్నారం అభయారణ్యం ట్రాకర్స్‌తో పాటు హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ స్వచ్ఛంద సంస్థకు చెందిన ట్రాకర్స్ సైతం అడవుల్లో అధికారులతో కలిసి తిరిగినట్లు సమాచారం. పులి ఈ ప్రాంతంలోనే సంచరిస్తున్నట్లు వారు నిర్ధారించినట్లు తెలుస్తోంది. జిల్లాలోని భూపాలపల్లి డివిజన్‌లో ఆడ పులి, మహదేవపూర్ డివిజన్‌లో ఓ మగ పులి సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి మహబూబాబాద్‌లోని ఓ లాడ్జిలో ఆత్మహత్యకు పాల్పడినట్లు టౌన్ ఎస్సై శివకుమార్ శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం... జిల్లా కేంద్రంలోని రాంచంద్రాపురం కాలనీకి చెందిన వెల్పుల వీరయ్య(65) పంచాయతీరాజ్ శాఖలో అటెండర్‌గా విధులు నిర్వహించి రెండేళ్ల క్రితం పదవీవిరమణ పొందారు. ఆస్తి పంపకాల విషయంలో కుటుంబంలో కొద్దిరోజులుగా గొడవలు జరుగుతున్నట్లు చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మూడ్రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి లాడ్జిలో రూంను అద్దెకు తీసుకున్నాడు. శనివారం ఉదయం గదిలో నుంచి వీరయ్య బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి యాజమాని తలుపులు పగులగొట్టి చూడగా ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. లాడ్జి యాజమాని వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం వీరయ్య మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు యాకాంబ్రం, ఐలేష్, కుమార్తె కల్యాణి ఉన్నారు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రామప్పను సందర్శించిన జపాన్ దేశస్థులు

వెంకటాపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాలంపేట గ్రామంలో గల యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని జపాన్ దేశానికి చెందిన యూట్యూబర్స్ రైవుటాసైట్, , మాయో, ఇండోకర్రికోలు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించగా ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం వారు దేవాలయ శిల్పకళా సంపదను వీక్షించి అబ్బురపడ్డారు. ఆలయ చరిత్ర, విశిష్టత గురించి గైడ్ విజయ్ కుమార్ వారికి వివరించారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని బోటింగ్ చేస్తూ ప్రకృతి అందాలను ఆస్వాదించారు.



జపాన్ దేశస్థులకు ఆలయ శిల్పకళా సంపద గురించి వివరిస్తున్న గైడ్ విజయ్‌కుమార్

వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించాలి

- సమీక్ష సమావేశంలో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో గోపాల్‌రావు

ములుగు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వేసవిలో జిల్లాలోని ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కల్పించాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి గోపాల్‌రావు వైద్యులు, సిబ్బందిని ఆదేశించారు. ములుగులో జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం మాతా,శిశు సంరక్షణ బృందం సిబ్బంది, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం సిబ్బందితో సమీక్ష సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పాఠశాలల పిల్లలు వడదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎవరూ వడదెబ్బ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్, ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్తలు సమన్వయంతో శిశు సంరక్షణ సిబ్బంది నిర్దిష్టమైన ప్రణాళికలు తయారుచేసుకుని గర్భిణులు, బాలింతలకు నిరంతర పరీక్షలు నిర్వహించాలన్నారు. గర్భిణులలో రక్తహీనతను గుర్తించి వారికి పోషకాహారం పట్ల అవగాహన కల్పించాలని, సాధారణకాన్పు ఉపయోగాలు, సిజేరియన్ కాన్పు వల్ల జరిగే నష్టాలను వివరించాలన్నారు.

ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలోని అన్ని హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్లలోని పిల్లలకు వైద్యపరీక్షలు నిర్వహించాలని, వడదెబ్బ వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేయాలన్నారు.సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో విపిన్ కుమార్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీకాంత్, పవన్‌కుమార్, రణ ధీర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పూర్ణ, సంపత్‌రావు, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం కోఆర్డినేటర్ నరహరి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

దాన ధర్మాల.. జకాత్

సండే స్పెషల్ SUNDAY SPECIAL

- రంజాన్ మాసంలో ఇదో పవిత్ర కార్యక్రమం
- సంపాదనలో కొంత పేదలకు పంచాలని బోధిస్తున్న ఖురాన్
- డబ్బు, ఆస్తిపై వ్యామోహాన్ని దూరం చేయడమే పరమార్థం



మహబూబాబాద్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) : కఠోర ఉపవాస దీక్షలతో నెల రోజుల పాటు కొనసాగే రంజాన్ మాసంలో అతి ముఖ్యమైన పవిత్ర కార్యక్రమం జకాత్. జకాత్ అంటే తాము సంపాదించే దానిలో కొంత మొత్తాన్ని పేదలకు పంచిపెట్టడం. ముస్లింలు ఈ జకాత్‌ను తప్పనిసరిగా పాటించాలని ఖురాన్ బోధిస్తోంది. ఆ ప్రకారం ముస్లింలు రంజాన్ మాసంలో దానధర్మాలు చేస్తుంటారు. ఉపవాసం (రోజా) శారీరక ఆరాధన కాగా, జకాత్‌ను ఆర్థిక ఆరాధనగా భావిస్తారు. జకాత్ చెల్లించడం వల్ల ధనం పరిశుద్ధ పరచబడుతుందని చెబుతారు. మానవుల్లోని ధనవ్యామోహాన్ని దూరం చేయడానికే అల్లాహ్ అతనిపై జకాత్ ఫర్జ్ (తప్పనిసరి) చేస్తారు. ఇస్లామియా (షరియత్) రీత్యా జకాత్ చెల్లించడం తప్పనిసరి. సమాజంలోని నిరుపేదల హక్కు అయిన జకాత్ చెల్లించకపోతే అది పరలోక జీవితంలో ఎంతటి విషమ పరిణామానికి గురికావాల్సి వస్తుందో ఈ హదీసు తెలియజేస్తుందని ముస్లింల నమ్మకం. జకాత్ చెల్లించడానికి అర్హులైన విశ్వాసులు తమ సంవత్సరం సంపాదనలో కొంత నిర్ణీత మొత్తాన్ని నిరుపేదలు, అనాథలకు తప్పనిసరిగా చెల్లించాలి. క్రమశిక్షణ, ఓర్పు, సహనానికి మారుపేరైన ఇస్లాం మతంలోని ముస్లింలకు ఈ నెలలో ఆ లక్షణాలు అద్దం పట్టేలా కన్పిస్తాయి.

జకాత్ సొమ్ముకు అనర్హులు వీరే..

జకాత్ ఎవరు పడితే వారు.. ఎవరికంటే వారికి ఇవ్వడానికి కుదరదు. ముఖ్యంగా తండ్రి, తల్లి, తాత, ముత్తాత, నాయనమ్మ, అమ్మమ్మ, అమ్మమ్మతల్లి, నాయనమ్మ తల్లి, కొడుకులు, కూతుళ్లు, మనుమలు, మనుమరాళ్లు, మనుమల సంతానం, మనుమరాళ్ల సంతానం అంతే కాదు భర్తకు భార్య కానీ, భార్యకు భర్త కానీ జకాత్ ఇవ్వకూడదు.

ఎలా చెల్లించాలి ? ఎవరెవరు చెల్లించాలి ?

ధర్మశాస్త్రం (షరిషత్) 'నిసాబ్' నిర్ణయించిన పరిమాణం మేరకు యాభై రెండున్నర తులాల వెండి, ఏడున్నర తులాల బంగారం ఉండి సంవత్సరం గడిస్తే వాటి వెలకట్టి నూటికి రెండున్నర రూపాయల చొప్పున బీదవారికి చెల్లించాలి. అదే విలువల గల వెండి, బంగారాన్ని జకాత్‌గా చెల్లించవచ్చు. వెండి, బంగారాల వెలకు సరిపడు కరెన్సీ నోట్లు, నాణేలు ఉండి సంవత్స రం గడిచిపోతే వాటిపై కూడా నూటికి రెండున్నర రూపాయల చొప్పున జకాత్ తీసి పేదవారికి ఇవ్వాలి. వ్యాపారం ప్రారంభించిన తేదీ నుంచి సంవత్సరం గడిచిన తర్వాత స్టాకు విలువ, నగదు లెక్కించి ధర్మశాస్త్రం ప్రకారం జకాత్ చెల్లించాలి. వ్యవసాయోత్పత్తుల దిగుమతి ఎప్పుడవుతుందో అప్పుడే ఉష్ర్ పేరిట సంవత్సరానికి పంటలు తీసిన రెండు, మూడుసార్లు చెల్లించాలి. వర్షం, వాగువంకల ద్వారా పండే పంటలు, నదీతీరాల తేమ వల్ల పండే చిత్తడి భూముల్లోనూ ఉత్పత్తి అయ్యే ఫలసాయం నుంచి పదో భాగాన్ని ఉష్ర్‌గా చెల్లించాలి. ఆదేరీతిన కృత్రిమ కాలువలు, చెరువులు, జలాశయాలు, సాధారణ, గొట్టపు బావుల ద్వారా పండే భూములు, శ్రమద్వారా పండే భూముల్లో ఉత్పత్తి అయ్యే ఫలసాయంలో 20వ భాగాన్ని చెల్లించాలి.

జకాత్ తీసుకోడానికి అర్హులు..

- ఫకీర్ : పూటగడవని వారు, ఆస్తిపాస్తులు లేకపోగా జీవనోపాధి కోసం శ్రమించే శక్తి లేనివారు, వ్యాధిగ్రస్థులు, అనాథలు, వితంతువులు.
- మిస్కీన్ : ఇతరుల ముందు చేయిచాపని నిరుపేద, అవసరం ఉన్నప్పటికీ ఆత్మాభిమానం వల్ల ప్రజల ముందు చేయిచాపని వారు.
- రుణగ్రస్థుడు : అప్పుతీర్చలేని రుణగ్రస్థులు, ఆస్తిధ్వంసం అయిన వారు. అసాధారణ జరిమానా విధించబడిన వారు. వ్యాపారం దివాలా తీసిన వారు. విపత్తు సంభవించి సర్వం కోల్పోయిన వారు. అసాధారణ ఆపదల్లో చిక్కుకున్న వారు.
- ముసాఫిర్ (బాటసారి): ఆస్తిపరుడైనప్పటికీ ప్రయాణంలో అవసరమైనవారు.
- ఫిసబీలిల్లాష్ : అల్లాహ్ మార్గంలో ధర్మ సంస్థాపనకు సంబంధించిన పనుల్లో ఉన్నవారు, ధార్మిక విద్యనభ్యసించే వారి సహాయార్థం.
- జకాత్ వసూలు చేసే (ఉద్యోగి) ఆమిలె సదఖాకి జకాత్ నుంచి ఇస్లామియా ప్రభుత్వం జీతం చెల్లించవచ్చు.

నిరుపేదల హక్కు ఫిత్రా..

రంజాన్ నెల రోజుల ఉపవాసాలు ముగిసిన తర్వాత షవ్వాల్ చంద్రదర్శనం జరిగిన మరుసటి రోజు ముస్లిం సోదరులు ఈదుల్ ఫిత్ర్ పండుగ ఘనంగా జరుపుకొంటారు. దీన్నే రంజాన్ అంటారు. ఫిత్రా అనే పదం ఇఫ్తార్ నుంచి వచ్చింది. ఇది ముస్లింలందరిపై విధిగా నిర్దేశింపబడింది. ఫిత్రా దానం అంటే సుమారు పావుతక్కువ రెండుసేర్లు గోధుమలు కానీ, వాటికి సమానమైన ధాన్యాలు కానీ లేక వాటి వెలకు సమానమైన నగదు కానీ, వస్త్రరూపంలో, నగదు రూపంలో చెల్లించవచ్చు. ఫిత్రా దానానికి ఆర్థిక స్థోమతతో ఎలాంటి సంబంధం లేదు. ప్రజలు పేద, ధనిక వర్గ బేధాలు లేకుండా ఫిత్రా చెల్లించాలి. కుటుంబ సభ్యులందరిపై ఫిత్రాదానం చెల్లించాల్సి ఉంటుంది. ఫిత్రాదానం ఈద్ (పండుగ) నమాజ్‌కు ముందే ఇవ్వాలి. పండుగనాడు అందరూ ఆనందోత్సాహాలతో కొత్త దుస్తులతో షడ్రసోపేతమైన భోజనాలతో, బంధుమిత్రుల కోలాహలంతో నిండి ఉంటే మరో పక్క నిరుపేదలు ఆకలితో అలమటించకుండా ఈ పండుగలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో పాటు నెల రోజుల ఉపవాసం ఉండే సమయాన సహజ దౌర్భాగ్యాల వల్ల జరిగే పొరపాట్ల నుంచి ప్రక్షాళన చేసుకోవడం కోసం ఈ ఫిత్రాదానం నిరుపేదల హక్కు అనే దృష్టితో చెల్లిస్తే దైవ ప్రసన్నతకు అర్హులవుతారంటారు.


జకాత్ చెల్లించే వారెవరంటే..

- తప్పనిసరిగా ముస్లిం అయి ఉండాలి
- జకాత్ చెల్లించే స్థోమత కలిగి ఉండాలి
- చైతన్యవంతుడైన వయోజనుడై ఉండాలి
- జకాత్ పుచ్చుకున్న వ్యక్తిని యజమానిగా చేయగలగాలి
- ఖురాన్ చూపించిన పద్ధతుల్లోనే జకాత్ చెల్లించాలి
- జకాత్ చెల్లించే వారు సంకల్ప బలంతో ఉండాలి

వారం వారం.. విష్ణు సహస్ర నామ పారాయణం

» ఐదేళ్లుగా కొనసాగిస్తున్న గిరిధర్ కృష్ణ » నేడు హైదరాబాద్‌లో సువర్ణఘంటా కంకణ ప్రదానం


పారాయణం చేస్తున్న భక్తులు


వెంకట గిరిధర క్రిష్ణ

హనుమకొండ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణానికి కఠోరమైన నియమాలు నిష్టలు లేవు. కావాల్సింది భక్తి ఒక్కటే. కుల మత వివక్ష లేకుండా అందరూ పారాయణం చేసుకోవచ్చు. ఏ సమయంలో చేసినా సత్ఫలితాలొస్తాయని నమ్మకం. పరమ రహస్యమైన పరమాత్మ తత్వమంతా ఈ వేయి నామాలలో అంతర్భాగంగా ఉందని నమ్ముతారు. విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణాలు జరిగే చోట విచారాలు, విషాదాలు, నైరాశ్యాలు, కన్నీళ్లు ఉండవని అంటారు. అలాంటి విష్ణు సహస్ర నామ పారాయణాన్ని ఐదేళ్లుగా ప్రతీ శనివారం వారం వారం చేస్తూ రికార్డు సృష్టించిన ఘనత ఒక ప్రభుత్వ ఉపాధ్యాయునికే దక్కింది. హనుమకొండ భీమారం ప్రాంతంలో నివాసం ఉంటున్న పరాంకుశం వెంకట గిరిధర కృష్ణ, శిరీష దంపతులు 2019 సెప్టెంబరు 17న తొలి పారాయణం ప్రారంభించారు. ఆయన వృత్తిరీత్యా ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ప్రస్తుతం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఆయన భార్య శిరీష కూడా అదే పాఠశాలలో గణితం టీచర్‌గా పని చేస్తున్నారు. గిరిధర్ కృష్ణ పాఠాలు చెప్పడంలోనే కాదు ఆధ్యాత్మిక పారాయణాల్లోనూ ఘనాపాఠీ కావడం గమనార్హం. ఆయనతో పాటు భార్య శిరీష కూడా పారాయణాల్లో పాలు పంచుకుంటున్నారు. తొలుత 11 వారాలు క్రమం తప్పకుండా చేయాలన్న ఈ పారాయణాల పరంపర 11 నుంచి 20కి, 20 నుంచి 25, 40, 50 ఇలా పొడిస్తూ.. మరో నాలుగు వారాలు అయితే ఏకంగా 300 పారాయణాలకు చేరుకోనుంది. ప్రతివారం ఏదో దేవాలయంలోనో లేక స్నేహితులు, బంధువుల ఇళ్లల్లోనే 20 నుంచి 50 మంది మహిళల, మిత్రుల సహకారంతో ప్రతి శనివారం సాయంత్రం 7 నుంచి ఈ పారాయణం కొనసాగుతూనే ఉంది. అలాగే పాపికొండలు వెళ్లినప్పుడు పడవలో, ఢిల్లీ, మధిర, బృందావనం ప్రదేశాలకు వెళ్లినప్పుడు విమానంలో శ్రీరంగం, అయోధ్య లాంటి ప్రదేశాలకు వెళ్లినప్పుడు రైలులోనూ పారాయణాలు కొనసాగించడం విశేషం. కరోనా కష్ట కాలంలోనూ ఈ పారాయణాలను కొనసాగించారు. వందవ పారాయణం చేసినప్పుడు అఖండ పారాయణం అంటే శుక్రవారం రాత్రి నుంచి శనివారం రాత్రి 7 గంటల వరకు నిరంతరం 120కి పైగా పారాయణాలు చేయించారు గిరిధర్. అదే విధంగా 250 పారాయణాల అనంతరం కూడా మరోసారి అఖండ పారాయణం పూర్తి చేశారు. ఇదే క్రమంలో సుదర్శన యాగం కూడా నిర్వహించారు. తిరుమల తిరుపతిని దర్శించుకున్నప్పుడు జరిగిన పలు ప్రత్యక్ష సంఘటనలే తనను ఈ శ్రీ విష్ణు సహస్ర నామ పారాయణానికి శ్రీకారం చుట్టేలా చేశాయని గిరిధర్ పేర్కొన్నారు. ఇప్పటి వరకు 296 వారాలపాటు అంటే ఐదేళ్లుగా ఈ పరంపర కొనసాగుతోందని, భగవంతుని కృపతో వేయి వారాలు కొనసాగిస్తామన్న నమ్మకం ఉందన్నారు.

నేడు సువర్ణ ఘంటా కంకణ ప్రదానం

హైదరాబాద్‌లోని సీవీ రామన్ అకాడమీ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో పారాయణ ఘనాపాఠి గిరిధర క్రిష్ణను శ్రీ విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ వైభవ రత్న బిరుదుతోపాటు సువర్ణ ఘంటా కంకణ ప్రదానం చేయనున్నట్లు కార్యక్రమ నిర్వాహకుడు, అకాడమీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహేశ్ వాది వెంకటేశ్వర్‌రావు చెప్పారు.

భద్రకాళి అమ్మవారి సన్నిధిలో సినీ హీరో శ్రీకాంత్


భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న శ్రీకాంత్

వరంగల్ కల్చరల్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సుప్రసిద్ధ భద్రకాళి అమ్మవారిని ప్రముఖ చలనచిత్ర నటుడు శ్రీకాంత్ దర్శించుకున్నారు. శనివారం ఆలయానికి విచ్చేసిన శ్రీకాంత్ ముందుగా వల్లభ గణపతిని అనంతరం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు అమ్మవారి శేష వస్త్రాలను శ్రీకాంత్‌కు అందజేసి ఆశీర్వచనం చేశారు. శ్రీకాంత్ వెంట ప్రముఖ వైద్యులు డాక్టర్ పాములపర్తి రామారావు, ఆలయ సిబ్బంది కూచన హరినాథ్, ఫొటోగ్రాపర్ శ్యామ్, అశోక్, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అమ్మవారి దర్శనార్థంకు వచ్చిన శ్రీకాంత్‌తో భక్తులు సెల్ఫీలు, ఫొటోలు దిగారు.

సినిమా షూటింగ్‌లకు వరంగల్ ఎంతో అనుకూలం

చారిత్రక నగరంగా పర్యాటక ప్రాంతమైన వరంగల్ సినిమా షూటింగ్‌లకు అనుకూలమైందని ప్రముఖ సినీ హీరో శ్రీకాంత్ అన్నారు. తాను భద్రకాళి అమ్మవారిని దర్శించుకోవడం ఇది రెండోసారి అన్నారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ పెద్ద నగరమని ఇక్కడ అనేక చారిత్రక ప్రదేశాలు ఉన్నాయన్నారు. వరంగల్‌కు ఎయిర్‌పోర్ట్ కూడా మంజూరు కావడంతో ఈ ప్రాంతం పర్యాటక ప్రాంతంగానే కాకుండా సినిమా షూటింగ్‌లకు కూడా అనుకూలమని అన్నారు. వ్యక్తిగత పనిపై వరంగల్‌కు రావడంతో అమ్మవారిని దర్శించుకున్నానని తెలిపారు.

వెంకన్నకు జోరుగా మొక్కులు

» కొనసాగుతున్న ఎర్రగట్టు జాతర
» చిన్న రథచక్రాల బండ్ల ప్రదక్షిణ


స్వామివారికి పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు


స్వామి వారి గండ దీపానికి తైలం పోసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

హసన్‌పర్తి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఎర్రగట్టు వెంకన్న జాతర రెండోరోజు భక్తుల రాకతో శనివారం ఘనంగా సాగింది. ఈవో వెంకట్రావుతో పాటు 14 మంది ఆలయ ధర్మకర్తల సమక్షంలో ఆలయ పూజారులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల తాకిడి పెరగడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. శ్రీవారి బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు శనివారం చిన్న రథచక్రాల బండ్ల ప్రదిక్షణ భక్తులను ఆకట్టుకుంది. భక్తులు వివిధ గ్రామాల నుంచి మేకలు, గొర్రెలు, ఎడ్ల బండ్ల రథచక్రాల బండ్లతో వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి పర్యవేక్షణలో కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్, ఎస్సైలు శ్రీకాంత్, రవీందర్ పోలీసు సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

ఎంచక్కా తాటిచెట్టు ఎక్కేయొచ్చు..



సహజంగా గౌడన్నలు తాటిచెట్లు ఎక్కుతారు. అందుకు వారు తమ సంప్రదాయ పరికరాలైన మోకులు వినియోగిస్తారు. కానీ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత గ్రామమైన ములుగు జిల్లా తాడ్వాయి మండలం కొండపర్తిలో మాత్రం ఆదివాసీలు తాటికల్లు గీస్తారు. అయితే ఇక్కడి ఆదివాసీలు మాత్రం ఇదిగో ఇలా తాటిచెట్లకు కంక బొంగులు కట్టి ఎక్కుతారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాపర్, జయశంకర్ భూపాలపల్లి







అభివృద్ధికి అడుగులు

(3వ పేజీ తరువాయి)


సభ స్థలిని పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

ఒంటి గంటకు శివునిపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు, అక్కడి నుంచి కాన్వాయ్‌లో వేదిక వద్దకు చేరుకుంటారు. 1.10 నుంచి 1.20 మధ్య వేదిక వద్ద వివిధ మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా శక్తి స్టాళ్లను, ఇందిరా మహిళా శక్తి బస్సులను సందర్శిస్తారు. 1.25 నుంచి 3 గంటల వరకు ప్రజాపాలన బహిరంగ సభలో పాల్గొంటారు. తిరిగి 3.10 గంటలకు శివునిపల్లి హెలిప్యాడ్ నుంచి బేగంపేటకు తిరుగు ప్రయాణం అవుతారు.

వేదిక పైనుంచే రిమోట్ ద్వారా..

స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలకు వేదిక పైనుంచే శంకుస్థాపన చేయనున్నారు. నియోజ కవర్గంలో 13 శాఖలకు సంబంధించి రూ.800 కోట్లతో 30పనులకు రిమోట్ ద్వారా శ్రీకారం చుడతారు. దీని కోసం వేదికకు ఎడమ వైపున ఒకేచోట శిలాఫలకాలను ఏర్పాటు చేశారు. వీటిని ప్రజలకు కనిపించే విధంగా ఏర్పాటు చేయగా సీఎం రేవంత్‌రెడ్డి వేదిక పైనుంచి రిమోట్ నొక్కి పనులను ప్రారంభిస్తారు.

సీఎం శంకుస్థాపన చేసే పనులు ఇవే..

జఫర్‌ఘడ్ మండలం కోనాయచలం వద్ద రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, స్టేషన్‌ఘన్‌పూర్ శివారు పల్లగుట్ట క్రాస్‌రోడ్డు వద్ద రూ.5.50కోట్లతో నూతన డిగ్రీ కాలేజీ, రూ.45.5కోట్లతో -ఘన్‌పూర్‌లో 100 పడకల ఆస్పత్రి, రూ.26 కోట్లతో ఘన్‌పూర్‌లో ఇంటిగ్రేటెడ్ డివిజనల్ స్థాయి ఆఫీస్ కాంప్లెక్స్‌కు శ్రీకారం చుడతారు. రూ.148.76కోట్లతో దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్-2లో భాగంగా ఆర్‌ఎస్ ఘన్‌పూర్ మెయిన్ కెనాల్ సీసీ లైనింగ్ పనులు, రూ.25.6కోట్లతో స్టేషన్‌ఘన్‌పూర్ నియోకవర్గంలో 750ఇందిరమ్మ ఇళ్లు, రూ.15కోట్లతో స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి తాటికొండ, జిట్టగూడెం మీదుగా మల్లన్నగండి వరకు రోడ్డు వెడల్పు పనులకు శంకుస్థాపన చేస్తారు. అలాగే రూ.23.5కోట్లతో పలు బీటీ రోడ్ల నిర్వహణ పనులు, మహిళా శక్తి కింద 7 ఆర్టీసీ బస్సులు, సోలార్ పవర్ ప్లాంట్లు, బ్యాంకు లింకేజీ రుణాలకు గాను రూ.15.87కోట్లు, రూ.కోటితో స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎస్పీడీసీఎల్ డివిజనల్ కార్యాలయ నిర్మాణం, రూ. 11.01కోట్లతో రఘునాథపల్లి మండలం కుర్చపల్లి, జఫర్‌ఘడ్ మండలం సాగరం, చిల్పూరు మండలం కొండాపూర్, రఘునాథపల్లి మండలం ఫతేషాపూర్, ధర్మసాగర్ మండలం రాయగూడెం గ్రామాల్లో సబ్‌స్టేషన్ల నిర్మాణాలు, రూ.2కోట్లతో బంజారా భవన్, రూ.12.9కోట్లతో గోవర్ధనగిరి నుంచి చర్లతండా వరకు రోడ్డు నిర్మాణం, రూ.245.25కోట్లు బ్యాంకు లింకేజీ రుణాలు, పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టనున్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయాలి

- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ఎంపీ కావ్యతో కలిసి విలేకరుల సమావేశం

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గం అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, అందులో భాగంగానే రూ.800 కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు చేశారని, అందుకు గాను ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆదివారం నిర్వహిస్తున్న ప్రజాపాలన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. ఎంపీ కడియం కావ్యతో కలిసి శనివారం సభా స్థలిని పరిశీలించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడానికి, కాంగ్రెస్, సీఎంరేవంత్ ఆహ్వానం, కార్యకర్తల అభిప్రాయాల మేరకు కాంగ్రెస్‌లో చేరారన్నారు. పార్టీలో చేరిన తొమ్మిది నెలల కాలంలో అడిగిందే తడువుగా నియోజకవర్గ అభివృద్ధికి సీఎం మంజూరు చేశారని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చి, టెండర్లు పిలిచిన తర్వాత అగ్రిమెంట్‌లు పూర్తయిన వాటికే సీఎం శంకుస్థాపనలు చేస్తున్నారన్నారు. ఈ పనులను 18 నెలల లోపు పూర్తి చేసి ప్రారంభోత్సవం చేయనున్నట్లు తెలిపారు.

15 నెలల కాలంలోనే కనీవినీ ఎరుగని అభివృద్ధి : ఎంపీ కడియం కావ్య

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే సీఎం రేవంత్ రెడ్డి వరంగల్‌కు అభివృద్ధికి భారీగా నిధులు మంజూరు చేశారన్నారు. ఆయన కృషితో మామునూరు ఎయిర్‌పోర్టు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, అభివృద్ధికి, కుడా మాస్టర్ ప్లాన్, కోచ్ ఫ్యాక్టరీ, అవుటర్ రింగ్ రోడ్డు అభివృద్ధికి రూ.5,500 కోట్ల నిధులు సీఎం మంజూరు చేశారన్నారు. ఇక ఘన్‌పూర్ నియోజకవర్గానికి కూడా రూ.800 కోట్లు మంజూరు చేశారన్నారు. కాజీపేట డివిజన్ కోసం కృషి చేస్తున్నామని, రైల్వే ప్రతిపాదించిన కొత్త రైల్వే లైన్లను నిలిపివేయాలని రైల్వే మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌ను కలిసి వినతిపత్రం అందించామన్నారు. సమావేశంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, పార్టీ మండలాధ్యక్షుడు శిరీష్ రెడ్డి, నాయకులు అంబటి కిషన్‌రాజ్, నరేందర్ రెడ్డి, నాగరబోయిన శ్రీరాములు, అన్నం బ్రహ్మారెడ్డి, కోతి రాములు, రాజేష్‌నాయక్, రజాక్‌యాదవ్, ఇల్లెందుల విజయ్, రాపోలు శివచరణ్ రెడ్డి, పోశాల కృష్ణ, నీలం యువరాజ్, జానీపాషా, కాసాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య

టెన్షన్.. టెన్షన్!

» సీఎం పర్యటన నేపథ్యంలో పలు పార్టీల నిరసనలు
» నీటి విడుదల, హామీల అమలు, ఎండిన పంటలకు పరిహారం కోసం డిమాండ్

జనగామ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌ఘన్‌పూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో టెన్షన్ వాతావరణం నెలకొంది. ఆయన రాక నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఎం పార్టీలు వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నాయి. చెరువులను నింపడం, ఎండిన పంటలకు పరిహారం, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు, పెండింగ్ పనులు పూర్తి కాకపోవడం లాంటి అంశాలపై సీఎం రేవంత్‌రెడ్డిపై మూడు పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. గోదావరి జలాలతో రిజర్వాయర్లు, చెరువులు నింపకపోవడంతో జిల్లావ్యాప్తంగా పంటలు ఎండిపోయాయని సీపీఎం విమర్శిస్తోంది. ఈ క్రమంలోనే సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా శనివారం ఆందోళనలను నిర్వహించింది. ఎండిన పంటలకు ఎకరాకు రూ. 50వేల పరిహారం ఇవ్వాలని, ఈ విషయంపై ఆదివారం జరిగే సభలో ప్రకటన చేయాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తోంది. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, చెరువులను నింపాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తోంది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్ పార్కు, పాలకుర్తి మండలంలోని చెన్నూరు రిజర్వాయర్ పనుల పూర్తి, జనగామలో పాలిటెక్నిక్ కాలేజీ ఏర్పాటు వంటి డిమాండ్లను బీజేపీ లేవనెత్తుతుంది. కాగా.. మూడు పార్టీల డిమాండ్ల నేపథ్యంలో సీఎం పర్యటన ఏ విధంగా సాగుతుందన్నది చూడాల్సి ఉంది.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపని మంత్రి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

ఏటూరునాగారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సొంత నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి రాష్ట్ర మంత్రి సీతక్క చొరవ చూపడం లేదని బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు మంత్రి సీతక్కపై తీవ్ర విమర్శలు చేశారు. శనివారం ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలో తమ నివాసంలో బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ములుగు నియోజకవర్గంలో మంత్రి సీతక్క ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని, కాంట్రాక్ట్ పనుల పేరుతో రూ. 33 కోట్ల అవినీతి జరిగిందని ఆయన ఆరోపించారు. తూతూ మంత్రంగా సున్నం, తలుపులు పెట్టిన పనులకు కూడా భారీగా బిల్లులు చెల్లించడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. గోదావరి నది పరివాహక ప్రాంతంలో కరకట్ట పనులు నిలిపివేయడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆయన అవేదన వ్యక్తం చేశారు. ఏటూరునాగారం మండలం దొడ్ల వద్ద జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని, మిర్చి రైతులకు మద్దతు ధర క్వింటాకు రూ. 25 వేలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ములుగు జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ పోరిక గోవింద నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు గడదాసు


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహారావు

సునీల్ కుమార్, సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ బాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎమ్డీ. ఖాజాపాషా, మంగపేట మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, కన్నాయిగూడెం మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, ఏటూరునాగారం మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, రామన్నగూడెం మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ, నాయకులు తాటి కృష్ణ, గండేపల్లి నర్సయ్య, జాడి బోజారావు, కాళ్ల రామకృష్ణ, బట్టు రమేష్‌తో పాలు ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి కార్యకర్తలు పట్టుకొమ్మలాంటి వారు

మంగపేట : క్షేత్రస్థాయిలో పార్టీకి పట్టుకొమ్మల్లాగా ఉండి పార్టీని బలోపేతం చేస్తారని, కార్యకర్తలకు కంటికి రెప్పలా కాపాడుకుంటామని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు(లక్ష్మణ్‌బాబు) అన్నారు. శనివారం మండలంలోని కమలాపురం, గంపోనిగూడెం, మంగపేట, బోరునర్సాపురం, మల్లూరు, కొత్తమల్లూరు, చుంచుపల్లి, పాలాయిగూడెం, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పర్యటించి కార్యకర్తల యోగ క్షేమాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. రాజుపేటలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఎడ్లపెల్లి నర్సింహారావు గృహ ప్రవేశం కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించగా సంఘం మండల ప్రధానకార్యదర్శి గుండేటి రాజుయాదవ్ అధ్యక్షతన జరిగింది. జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవిందనాయక్, మంగపేట సహకార సంఘం చైర్మన్ తోట రమేష్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు తాటి కృష్ణ, కర్రి శ్యాంబాబు, కాకులమర్రి ప్రదీప్‌రావు, రామ్మూర్తి పాల్గొన్నారు.

వలస కూలీకి మలేరియా పాజిటివ్

- వివరాలు సేకరించిన రాష్ట్ర ఎంటమాలజీ అధికారి


మలేరియా పరీక్షలు నిర్వహిస్తున్న నాగయ్య తదితరులు

వాజేడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో చత్తీస్‌గఢ్ కూలీ పని నిమిత్తం వచ్చిన వ్యక్తికి మూడు రోజుల క్రితం మలేరియా పాజిటివ్ వచ్చింది. ఈ క్రమంలో శనివారం రాష్ట్ర ఎంటమాలజి అధికారి నాగయ్య ఆ వ్యక్తిని పరిశీలించి వివరాలు సేకరించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మలేరియా వచ్చిన వ్యక్తితో పాటు మరికొంత మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వాజేడు వైద్యశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. హెచ్ఈవో అజయ్‌కుమార్, ఎల్‌టీ మురళీ, వాజేడు వైద్యాధికారి తరుణ్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ టౌన్ ప్రెసిడెంట్‌గా సదానందం

మహదేవపూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : మహదేవపూర్ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు చంద్రమౌళి సూచన మేరకు మహ దేవపూర్ మండల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఆధ్వర్యంలో చింతకుంట సదానందంను మహదేవపూర్ టౌన్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. వర్గీకరణ సాధలో భాగంగా నూతన కమిటీలు వేయడంజరుగుతుందని, ఉద్యమ ంలో చురుగ్గా పాల్గొన్న వారికి క్రియాశీల బాధ్యతలు ఉంటాయని సురేష్ తెలిపారు.

ఈ నెల 24న హుండీ లెక్కింపు కార్యక్రమం

మహదేవపూర్, మార్చి 15(ఆంధ్రజ్యోతి) : పవిత్ర కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి దేవస్థానంలోని హుండీలను ఈ నెల 24వ తేదీన లెక్కించబడ ఉతుందని ఆలయ ఈఓ మహేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమానికి అధికారులు, సిబ్బంది సమయానికి రావాలని ఆయన కోరారు.

జడ్పీహెచ్ఎస్‌కు క్రీడా సామగ్రి అందజేత

మొగుళ్లపల్లి, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు శనివారం కొలిన్స్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు రూ.2లక్షల విలువచేసే క్రీడా సామగ్రిని అందజేశారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో సంస్థ ప్రతినిధి పోలినేని రామారావు మాట్లాడారు. రూ.2లక్షల విలువ చేసే క్రీడా సామగ్రిని బహూకరించిన సంస్థ ప్రతినిధులకు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గుండెల్లి రాజయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు భాగ్యశ్రీ, ఉపాధ్యాయులు వెంకన్న, కళ్యాణి, సురేందర్, రాజు, కుమారస్వామి, అనిల్‌కుమార్, లలిత, విజయభాస్కర్, రాజయ్య, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వాజేడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందిన అక్కిశెట్టి ఏసు బాబు కుటుంబంకు బీఆర్ఎస్ నాయకులు అండగా నిలిచారు. శనివారం ఆయన దశదిన కర్మలకు హాజరై రూ 8వేల ఆర్థిక సాయంను అందించారు. ఆ కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని మండల అధ్యక్షుడు పెనుమల్లు రామాకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాయం జానకి రమణ, నాంపల్లి లక్ష్మీనారాయణ, గిరిబాబు, నాగరాజు, ముత్తయ్య , కేదారేశ్వర్ , శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 18న అగ్నిపథ్ స్కీంపై అవగాహన

వాజేడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): ఈనెల 18న మండల కేంద్రంలోని ఐటీఐ కాలేజీలో అగ్నిపథ్ స్కీం పై అవగాహన కార్యక్రమం ఉంటుందని ఐటీఐ ప్రిన్సిపల్ శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరబాద్ ఆర్మీ క్యాంప్ నుంచి సంబంధిత అధికారులు వాజేడుకు రాబోతున్నారని ఆయన పేర్కొన్నారు. ఏజెన్సీలోని ఐటీఐ చదువుతున్న, ఐటీఐ చదివిన విద్యార్థులు ఈ అవగాహన సమావేశానికి రావాలని ఆయన కోరారు.

ప్రమాణ స్వీకారం చేసిన మార్కెట్ కమిటీ డైరెక్టర్లు

వెంకటాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నూగూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్లుగా మండలానికి చెందిన యాలం సాయి, పాయం వెంకట్రామయ్యలు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రమాణ స్వీకారం చేశారు.

వలంటీర్లుగా యువత ముందుకు రావాలి

కృష్ణకాలనీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతీ గ్రామం నుంచి డిగ్రీ చదువుకొని ఉచితంగా సేవ చేయాలనే గుణం కలిగిన యువత వాలంటీర్లుగా ముందుకు రావాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణబాబు పిలుపు నిచ్చారు. శనివారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేసులను గ్రామ స్థాయిలోనే పరిష్కరించాలనే బృహత్తర కార్యక్రమానికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ శ్రీకారం చుట్టిందని అన్నారు. కోర్టులు, పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరిగి విలువైన డబ్బులు, సమాయాన్ని కోల్పోతున్నారని, వివాదాలు లేని సమాజ నిర్మాణం కోసం రాజీ మార్గంలో కేసులను పరిష్కరించేలా చూడాలన్నారు. ప్రతీ గ్రామంలోని ఎవరైనా ముగ్గురు యువకులు, ఒక యువతి స్వచ్ఛందగా సేవ చేయాలనుకునే వారు న్యాయ సేవాధికార సంస్థలో సంప్రదించాలని జడ్జీ కోరారు.

వలస కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

వాజేడు, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకూరు గ్రామ శివారులోని మిర్చితోటల్లో పనిచేస్తున్న వలస కూలీలకు శనివారం హెచ్ఈవో వేణుగోపాలకృష్ణ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తలనొప్పి, జ్వరం, కళ్లుతిరగడం, వాంతులు, విరేచనాలు, తికమక అవడం, గుండె వేగంగా కొట్టుకోవడం, మూత్రం పసుపురంగులో రావడం, చర్మం ఎర్రగా కందిపోయిన వంటి లక్షణాలు ఉన్నట్లయితే వడదెబ్బకు గురైనట్లు నిర్ధారించుకోవాలన్నారు. వెంటనే సమీపంలో ఉన్న వైద్యకేంద్రానికి వెళ్లి తగిన చికిత్స తీసుకోవాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ నవీన్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నం

వాజేడు, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఒక వ్యక్తి ఆత్మహత్యాయత్నంకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని బొల్లారంకు చెందిన కుర్సం సోమరాజు శనివారం మద్యం పూటుగా సేవించి ఆ మత్తులో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108కు సమాచారం ఇచ్చారు. అక్కడకు చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది వెంకటాపురం వైద్యశాలకు, మెరుగైన వైద్యం నిమిత్తం ములుగు ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్సను అందిస్తున్నారు. ఈ సంఘటనపై వాజేడు పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ఇందిరాగాంధీ విగ్రహానికి తొలగిన ముసుగు

కాటారం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధన్వాడ గ్రామం వద్ద ఉన్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహానికి ఎట్టకేలకు ముసుగు తొలగింది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసినప్పటికీ ఇందిరాగాంధీ విగ్రహానికి వేసిన ముసుగు తొలగించకపోవడంపై శనివా రం 'ఆంధ్రజ్యోతి'లో 'కోడ్ ముగిసినా తొలగని ముసుగు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి పంచాయతీ సిబ్బందితో ఇందిర విగ్రహానికి ముసుగును తొలగింపజేశారు. నిరంతరం సమస్యల పరిష్కారానికి అధికారులను అప్రమత్తం చేస్తున్న 'ఆంధ్రజ్యోతి'ని పలువురు అభినందిస్తున్నారు.

పోలీసు సిబ్బంది సేవలు మరువలేనివి



పదవీ విరమణ సిబ్బందితో ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో సుదీర్ఘకాలం విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన సిబ్బంది సేవలు మరువ లేమని జిల్లా ఎస్పీ శబరీశ్ అన్నారు. పోలీస్‌శాఖలో 40ఏళ్ల పాటు పనిచేసి పదవీవిరమణ పొందిన హోంగార్డు సాంబయ్య దంపతులను శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శబరీశ్ శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ స్వామి, సాంబయ్య కుటుంబసభ్యులు, తోటి సిబ్బంది పాల్గొన్నారు.

కృతిమ మేధతో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపు

జిల్లా విద్యాధికారి రాజేందర్

కాటారం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్-ఏఐ)తో విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందుతాయని జిల్లా విద్యాధికారి రాజేందర్ అన్నారు. ఎఫ్ఎల్ఎన్(ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం)లో భాగంగా ఇటీవల రాష్ట్రంలో ప్రభుత్వం ఏఐ ద్వారా ప్రాథమిక తరగతుల విద్యార్థులకు భాష, గణిత సంబంధిత భావనలను పెంపొందించడానికి పైలట్ ప్రాజెక్ట్ కింద కొన్ని ప్రాథమిక పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా కాటారం డివిజన్ పరిధిలో చింతకాని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎంఈవో శ్రీదేవితో కలిసి డీఈవో రాజేందర్ శనివారం ప్రారం భించారు. ప్రస్తుతం జిల్లాలో చింతకాని, గుర్రంపేట ప్రాథమిక పాఠశాలల్లో ప్రారం భించిన కంప్యూటర్ ల్యాబ్‌లు రానున్న కాలంలో మరిన్ని పీఎస్‌లకు విస్తరిస్తాయన్నారు. ఎంఈవో శ్రీదేవి, హైస్కూల్ హెచ్ ఎం శైలజ, పీఎస్ హెచ్ ఎం దేవూనాయక్, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చంద్ర కళ, వీవోఏ పద్మ, ఉపాధ్యాయులు రాజబాబు, శారద, రవీందర్, జయరాజు, రాజారాం, హారిక పాల్గొన్నారు.


ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న డీఈవో రాజేందర్

ఎల్ఆర్ఎస్ ప్రొసీడింగ్ అందజేత

భూపాలపల్లిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న ఓ యజమానికి మునిసిపల్ అధికారులు వెంటనే ప్రొసీడింగ్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతం చేసిందని తెలిపారు. ఈ క్రమంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు ఎవరైనా చేసుకుంటే వారికి వెంటనే ప్రొసీడింగ్‌లు అందజేస్తామని తెలిపారు. ఈ సువర్ణావకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ చేసుకోవడం మూలంగా ప్రస్తుత మార్కెట్ రేట్ ప్రకారం తమ భూమికి విలువ పెరగుతుందని, అలాగే అనేక ప్రయోజనాలు ఉన్నాయని స్పష్టం చేశారు. టీపీవో సునిల్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి

టేకుమట్ల, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సాగునీరు లేక రైతులు పంటలు కాపాడుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారని, రైతులకు వెంటనే సాగునీరు అందించాలని ఎమ్మార్పీఎస్ టిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన మండలంలోని ఆశిరెడ్డిపల్లి, పంగిడిపల్లి గ్రామాలలోని పంట పొలాలలో పర్యటించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్, ప్రజా ప్రతినిధులు వెంటనే స్పందించి రైతులకు సాగునీరు అందేలా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు, ఆ సంఘం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నను పరిశీలించిన శాస్త్రవేత్తలు


మొక్కజొన్న పంటను పరిశీలించి రైతునుంచి వివరాలు సేకరిస్తున్న శాసతివేత్తలు

వెంకటాపురం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): వెంకటాపురం, వాజేడు మండలాల్లో రైతులు వేసిన బాండ్ మొక్కజొన్న పంటను శనివారం డాట్ శాస్త్రవేత్తలు పరిశీలించారు. మండలంలోని రాచపల్లి గ్రామంలోని మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. రైతులు అనుసరించిన వ్యవసాయ పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈవిషయంపై సమగ్ర నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు తెలియజేస్తామని మండల వ్యవసాయ అధికారి నవీన్ తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు దిలీప్‌కుమార్, నాగభూషణం, విశ్వలేజ్, ఏఈవో శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

గోవిందరావుపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యువత మత్తుకు బానిస కావొద్దని, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పస్రా ఎస్సై కమలాకర్ అన్నారు. శనివారం మండలకేంద్రంలో ఆయన ఆధ్వర్యంలో పోలీసులు స్నైపర్ డాగ్‌తో బస్టాండ్ ప్రాంతంతోపాటు కిరాణాషాపులు, పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎవరైనా గంజాయి, మత్తుపదార్థాలు సరఫరా చేసినట్లయితే వారి సమాచారాన్ని అందించాలని సూచించారు.

పోచమ్మ గుడి ఆలయం నిర్వహణలో కులస్థుల ఘర్షణ..

కృష్ణకాలనీ, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని గణేష్‌చౌక్‌లో గల పోచమ్మ గుడి ఆలయ నిర్వహణలో రజక కులస్థులు గొడవ పడ్డారు. కులస్థులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్నేళ్లుగా ఈ గుడిలో గోపరాజు సాంబలక్ష్మీ అనే మహిళ సేవలందిస్తూ వస్తోంది. ఈ క్రమంలో కులస్థులంతా ఏకమై ఆలయంలో సేవలందించుటకు గత కొద్దిరోజుల క్రితం వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో ఓరుగంటి లక్ష్మీ అనే మహిళ పాల్గొని గుడిలో సేవ చేసే అవకాశాన్ని దక్కించుకుంది. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా సేవలందిస్తున్న తనకే అవకాశం ఇవ్వాలని, తన ఆరోగ్యం బాగాలేదని సాంబలక్ష్మీ పలుమార్లు కులస్థులకు చెప్పింది. అయినప్పటికి కులస్థులు ఒప్పుకోక వేలం పాట ద్వారానే అన్ని గుడులకు సేవ చేసే అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. దీంతో గత ఐదు రోజులుగా సాంబలక్ష్మీ పోచమ్మ ఆలయం వద్ద నిరాహార దీక్ష చేస్తుంది. ఈ క్రమంలో కులస్థులు శనివారం గుడి వద్దకు వెళ్లి సంఘం నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించగా సాంబలక్ష్మీకి. వారికి మాటా మాట పెరిగింది. రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దూషణలు చేసుకొని ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణలో సాంబలక్ష్మీకి గాయాలయ్యాయి. దీంతో ఇరువర్గాలు ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. వారి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ వెల్లడించారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

వెంకటాపూర్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడంతోపాటు గంజాయి రహిత మండలంగా వెంకటాపూర్‌ను తయారు చేయాలని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన శనివారం పాత నేరస్థులతోపాటు అనుమానిత వ్యక్తులను సమావేశపరిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ యువత పెడదారిన వెళ్లొద్దని, ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మత్తుపదార్థాల నిర్మూలనకు యాంటీ డ్రగ్స్ వారియర్స్ పేరుతో కమిటీలు సైతం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు హాని కలిగించే గంజాయితోపాటు మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాల రవాణా గురించి తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం మండలంలోని వెల్తుర్లపల్లి క్రాస్ వద్దకు చేరుకుని రోడ్డు సేఫ్టీ కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై డీఎస్పీ కమిటీ సభ్యులతో చర్చించారు. ఆయనవెంట ములుగు సీఐ శంకర్, స్థానిక ఎస్సై జక్కుల సతీష్ ఉన్నారు.

గోటి తలంబ్రాల శోభాయాత్ర

గణపురం, మార్చి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మరావుపేటలో కోటి గోటి తలంబ్రాల శోభాయాత్రను భక్తులు ఘనంగా శనివారం నిర్వహించారు. ప్రతి ఏటా రాములోరి కల్యాణానికి సేకరించే గోటి తలంబ్రాలలో భాగంగా ప్రత్యేక పూజల అనంతరం వరి ధాన్యాన్ని గోటితో వొలచి బద్రాచలం పంపిస్తారు. అందులో భాగంగానే శనివారం గ్రామంలోని పురవీధుల గుండా ఆ ధాన్యాన్ని ప్రత్యేక పూజలు చేసి భద్రపరిచినట్లు ఉమామహేశ్వర సేవా సమితి అధ్యక్షుడు ఆకుల సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు దామోదర్, కురిమిళ్ళ తిరుపతి ఉన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

ఏటూరునాగారం, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రేణుక అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వినియోగదారుల హక్కులు, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. 2025 సంవత్సరం థీమ్ సుస్థిరమైన జీవనశైలికి ఒక న్యాయపరమైన పరివర్తన అని ఆమె తెలిపారు. నేటి సమాజంలో వినియోగదారులు మోసపోతున్న తీరును వివరించారు. కమర్స్ విభాగం అధ్యాపకులు జి. రాజశేఖర్, ఎకనామిక్స్ విభాగం అధ్యాపకులు పి. భాస్కర్, డి. నవీన్, డాక్టర్ పి. జ్యోతి, ఫాతిమ తదితరులు పాల్గొన్నారు.

జీరో మద్యంను పట్టించుకోరా..!

మహాముత్తారం, మార్చి15(ఆంధ్రజ్యోతి): మహాముత్తారం మండలంలో జీరో మద్యం అక్రమంగా బెల్టు షాపులకు సరఫరా చేసిన కేసులో బెల్టు షాపు నిర్వాహకులను పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు సరఫరా చేసిన వ్యక్తులను పట్టుకోవడం లేదని బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పూర్ణచందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరుతో మాట్లాడుతూ అమాయకులను అరెస్టు చేసి అసలు పాత్రదారులను తప్పిస్తున్నట్లు అనుమానాలు వస్తున్నాయని ఆరోపించారు. అసలు పాత్రదారులను వదిలేస్తే కాటారం ఎక్సైజ్ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం

మహాముత్తారం, మార్చి15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ములుగుపల్లి ప్రభుత్వ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశానికి శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన తహసిల్దార్ డీ. శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవో సంజీవరెడ్డి, గ్రామస్తులు రాజయ్య, ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, అనిల్‌నాయక్,సతీష్‌రెడ్డి, చంద్రకళ, యాదగిరి, సుధాకర్‌రెడ్డి,వెంకటేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హేమాచల క్షేత్రంలో భక్తుల సందడి

మంగపేట, మార్చి 15 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మల్లూరు హేమాచల క్షేత్రంలో వెలిసియున్న ఆదిలక్ష్మి చెంచులక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామిని శనివారం సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. వరంగల్, హనుమకొండ, కాజీపేట, కరీంనగర్, పెద్దపెల్లి, హుజూరాబాద్, కాటారం, మంథని, భూపాలపల్లి తదితర ప్రాంతాలతో పాటు వివిధ పట్టణ ప్రాంతాల నుంచి భక్తులు మండుతున్న ఎండలను లెక్కచేయకుండా కుటుంబ సమేతంగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ జలాంజనేయస్వామి, పంచముఖాంజనేయస్వామి, శ్రీ వేణుగోపాలస్వామి, శ్రీరమ సత్యనారాయణస్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. తదనంతరం కొండపై కొలువై ఉన్న స్వయాంభు పుట్టుస్వామిగా వీరాజీల్లుతున్న లక్ష్మీనర్సింహస్వామిని ప్రక్కనే కొలువైన అమ్మవార్లయిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి దేవతలను పోటీపడి దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లును చట్టబద్ధత చేయాలి

ములుగు కలెక్టరేట్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను నమ్మించి మోసం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు ఇరుగు పైడి అన్నారు. అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు 11శాతం చట్టబద్ధత చేసి ప్రభుత్వ ఉద్యోగ నియామకాల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ములుగులోని కలెక్టరేట్ ఆవరణలో చేపటిన నిరసన దీక్ష శనివారం నాటికి ఆరవరోజుకు చేరుకుంది. ఈదీక్షలో ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు, ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు కోతి కార్తీక్, రొంటాల భిక్షపతి, పెండాల సుందర్, పారునందుల శంకర్, కడారి కిరణ్, చంటి, రాజేంద్ర, లక్ష్మయ్య, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : మహదేవపూర్ మండల కేంద్రంలోని ఎడవల్లి గ్రామానికి చెందిన మేమునూరి జక్కయ్య ఐదో రోజు నిరసన కార్యక్రమంలో పాల్గొనగా బెల్లంపల్లి సురేష్ మాదిగ దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధయక్షులు బెల్లంపల్లి సురేష్ , వేమునూరి జక్కయ్య , మంత్రి రవితేజ, చకినారపు చందు , బెల్లంపల్లి మల్లేష్, జాషువా, సంజీవ్ పాల్గొన్నారు.

●ఏటూరునాగారం : రాష్ట్ర ముఖ్యమంత్రి మాదిగల పట్ల కక్ష సాధింపు ధోరణిని విడనాడాలని తుడుందెబ్బ ములుగు జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్ధన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహ ఎదుట ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన దీక్షలను చేపడుతున్నారు. ఈ దీక్షలకు ముఖ్యఅతిథిగా హాజరైన తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ మాట్లాడారు. ఈ నిరసన దీక్షలో ఆదివాసీ నాయకపోడు హక్కుల పొరాట సమితి రాష్ట్ర పోలీట్ బ్యూరో సభ్యులు బోలెం సారయ్య, తుడుందెబ్బ మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోసెట్టి అనసూర్య, తుడుందెబ్బ మహిళా ములుగు జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీకాంత, సొలం సురేష్ పాల్గొన్నారు.


మహదేవపూర్‌లో దీక్షల్లో కూర్చున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మహనీయుల ఆశయాలను కొనసాగిస్తాం..

భూపాలపల్లిటౌన్, మార్చి 15 (ఆంధ్రజ్యోతి): మహనీయుల ఆశయ సాధన కోసం కృషి చేస్తామని దర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చిట్యాల శ్రీనివాస్ అన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద కేక్ కట్ చేసి కాన్షీరాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు జిల్లా ప్రధాన కార్యదర్శి కండె రవి, నాయకులు మంద రమేష్, బొజ్జపల్లి మహర్షి, జగన్, దూడపాక శ్రీకృష్ణ, శ్యామ్, స్వామి, రాజు, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

● ఏటూరునాగారం : మండల కేంద్రంలో కాన్షీరాం 91వ జయంతిని, ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ కార్యక్రమాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ధర్మసమాజ్ పార్టీ ములుగు జిల్లా నాయకులు సురేష్ మహారాజ్ ముఖ్యఅతిథిగా హాజరై కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కటింగ్ చేశారు. ధర్మ సమాజ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


అంబేద్కర్ కూడలివద్ద కేక్ కట్ చేస్తున్న డీఎస్పీ నాయకులు